TG/TEL/25/A3731

# నిజం

—దృష్టి తెలుగు న్యూస్—

హైదరాబాద్ ఎడిటర్: వరుదు సుజాత సంపుటి:-1 సంచిక:-209 పేజీలు:-4 సోమవారం 10-08-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD | HYDERABAD | NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR | KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

WANTED

రిపోర్టర్లు కావలెను

నిజం —దృష్టి తెలుగు న్యూస్—

దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సెల్: 9247842354

## హైదరాబాద్‌లో 40 లక్షల

# ఓట్లు గల్లంతు?



- ఓటర్ల జాబితా సర్వేతో భారీ మార్పులు!
- హైదరాబాద్‌లో భారీగా తగ్గనున్న ఓటర్ల సంఖ్య
- సుమారు 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగింపు అంచనా
- సొంతూరిలో ఓటు హక్కుకే వలసదారుల మొగ్గు
- సనత్‌నగర్‌లో అత్యధికంగా 45శాతం ఓట్ల రద్దుకు అవకాశం
- ఆగస్టు 17న విడుదల కానున్న ముసాయిదా ఓటర్ల జాబితా

రాజధాని హైదరాబాద్ నగరంలో ఓటర్ల సంఖ్యలో భారీ మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే కారణంగా గ్రేటర్ పరిధిలో ఏకంగా 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. రేపటితో ఈ సర్వే కార్యక్రమం ముగియనుండగా, నిన్నటి వరకు ఉన్న సమాచారం ప్రకారం రాజధానిలోని మూడు జిల్లాల పరిధిలో ఉన్న 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 1.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో దాదాపు మూడో వంతు ఓట్లు రద్దయ్యే సూచనలు కనిపిస్తుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికీ ఆది, సోమవారాల్లో బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓ) నుంచి ఉన్నతాధికారుల వరకు విధుల్లోనే ఉంటారని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించని ఓటర్లు ఎవరైనా ఉంటే వెంటనే అందజేయాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసి, ఈ నెల 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించేందుకు అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.ఓట్ల తొలగింపు ప్రభావం దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఉన్నప్పటికీ, - మిగతా 2 లో



## నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ వద్దు.. విద్యార్థుల నిరసన!

- నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ సూర్యకాంత్‌ను పిలవొద్దని విద్యార్థుల డిమాండ్
- దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి యాజమాన్యానికి లేఖ అందజేశారు
- నీట్ నిరసనలపై సీజేఐ చేసిన వ్యాఖ్యలే అభ్యంతరాలకు కారణంగా వెల్లడి
- ఇటీవలే ముంబై టిస్‌లోనూ ఇదే తరహా నిరసనలతో స్నాతకోత్సవం వాయిదా

హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు నిరసన గళం విప్పారు. ఈ మేరకు దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి విశ్వవిద్యాలయ - మిగతా 2 లో

## రుద్రమదేవి నుంచి శ్రీకృష్ణదేవరాయల వరకు



- బోనాల పండుగకు వేల ఏళ్ల చరిత్ర!
- కాకతీయ రాణి రుద్రమదేవి బోనం సమర్పించినట్లు ఆధారాలు
- 1516లోనే బోనాలపై పన్ను రద్దు చేస్తూ శ్రీకృష్ణదేవరాయల శాసనం
- ప్లేగు వ్యాధి కంటే ముందే బోనాలు ఉన్నాయని రుజువు చేస్తున్న పరిశోధనలు
- కుతుబ్ షాహీల కాలం నుంచీ గోల్కొండలో నిరంతరాయంగా ఉత్సవాలు

తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగ చరిత్ర నిన్నమొన్నటిది కాదని, దానికి వేల ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం ఉందని చారిత్రక ఆధారాలు వెల్లడిస్తున్నాయి. 1816లో హైదరాబాద్‌లో ప్లేగు వ్యాధి - మిగతా 2 లో

## ఏదో ఒకరోజు అమిత్ షా సమాధానం చెప్పక తప్పదు



- రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించకపోవటాన్ని తప్పుపట్టిన రాహుల్
- విద్యార్థుల ప్రతిధ్వని కార్యక్రమంలో ఓ విద్యార్థి ఆవేదనను పంచుకున్న కాంగ్రెస్ అగ్రనేత

నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఆందోళన చేసిన విద్యార్థులపై పోలీసుల దాడి ఘటనకు సంబంధించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించకపోవటాన్ని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. అమిత్ షా ఏదో ఒకరోజు సమాధానం చెప్పక తప్పదన్నారు. ప్రధాని మోదీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పటానికి బదులు వారినే క్షమిస్తున్నానని ప్రకటించటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో శనివారం జరిగిన 'ఛాత్రోంకీ గూంజ్' (విద్యార్థుల ప్రతిధ్వని) కార్యక్రమంలో ఓ విద్యార్థి తనతో పంచుకున్న ఆవేదనను రాహుల్ 'ఎక్స్' ద్వారా ఆదివారం పంచుకున్నారు.ఉన్న భూమి అమ్మి, అదీ చాలక అప్పులు చేసి మరీ పరీక్షకు సిద్ధమైతే చివరికి దక్కిందేమీ లేదని బాధిత విద్యార్థి వాపోయినట్లు రాహుల్ చెప్పారు. - మిగతా 2 లో

## ట్రంప్ కొత్త హెయిర్‌స్టైల్‌పై రచ్చ.. సోషల్ మీడియాలో మీమ్స్ వెల్లువ!



- లాస్ వెగాస్‌లో కొత్త హెయిర్‌స్టైల్‌తో కనిపించిన డొనాల్డ్ ట్రంప్
- ఆయన జుట్టుపై సోషల్ మీడియాలో మీమ్స్, జోకులు వైరల్
- ట్రంప్ లుక్‌పై ఆయన సోదరుడి కుమార్తె మేరీ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- చిత్తవైకల్యంతో బాధపడిన తన తండ్రిని ట్రంప్ గుర్తుచేశారని వ్యాఖ్య
- ట్రంప్ జుట్టుపై ఏఐ జనరేటెడ్ వీడియో కూడా ఆన్‌లైన్‌లో హల్‌చల్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన హెయిర్‌స్టైల్‌తో వార్తల్లో నిలిచారు. ఇటీవల లాస్ వెగాస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన సరికొత్త లుక్‌తో కనిపించారు. గతంలో కంటే భిన్నంగా, మరింత ఒత్తుగా, బంగారు రంగులో మెరిసిపోతున్న ఆయన జుట్టు అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆయన తన - మిగతా 2 లో



## బ్రహ్మోస్‌కు ప్రపంచవ్యాప్తంగా

# పెరిగిన గిరాకీ

- కొనుగోలుకు క్యూ కడుతున్న దేశాలు!
- ఆపరేషన్ సిందూర్‌తో బ్రహ్మోస్‌కు అంతర్జాతీయంగా భారీ డిమాండ్
- పాక్ వద్ద ఉన్న చైనా ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను విజయవంతంగా ఛేదించిన క్షిపణి
- వియత్నాం, ఇండోనేషియాతో వందల మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు ఖరారు
- పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా దేశంలోని నాలుగు కేంద్రాల్లో ఉత్పత్తి వేగవంతం

భారత అమ్ములపొదిలోని బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణికి అంతర్జాతీయంగా గిరాకీ అమాంతం పెరిగింది. ముఖ్యంగా, 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఈ క్షిపణి చూపిన అద్భుతమైన పనితీరు, దాని కచ్చితత్వం, విధ్వంసక శక్తి ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించాయి. ఈ ఆపరేషన్ తర్వాత బ్రహ్మోస్ కొనుగోలుకు పలు దేశాలు తీవ్ర ఆసక్తి చూపుతుండగా, ఇప్పటికే - మిగతా 2 లో



## ఐక్యతే మన బలం క్విట్ ఇండియా స్ఫూర్తిపై పవన్ ట్వీట్

- క్విట్ ఇండియా ఉద్యమాన్ని స్మరించుకున్న పవన్ కల్యాణ్
- స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళులు
- సిసలైన భారతావని నిర్మాణమే వారికిచ్చే గౌరవమన్న పవన్
- ఐక్యత, సమష్టి సంకల్పమే దేశ నిజమైన బలమని వ్యాఖ్య

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకుంటూ, ఆ మహోద్యమంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఘన నివాళులర్పించారు. శనివారం ఆయన 'ఎక్స్' వేదికగా ఈ మేరకు తన సందేశాన్ని పంచుకున్నారు. దేశ - మిగతా 2 లో



## తిరుమలలో విపరీతమైన భక్తుల రద్దీ

- ఆక్టోపస్ బిల్డింగ్ వరకు క్యూలైన్లు
- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల భారీ రద్దీ
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు నిండి బయటకు చేరిన క్యూలైన్లు
- గోగర్భం డ్యామ్ సర్కిల్ వద్ద ఆక్టోపస్ భవనం వరకు బారులు
- సర్వదర్శనానికి 20 నుంచి 24 గంటల నిరీక్షణ

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తడంతో కొండపై విపరీతమైన రద్దీ నెలకొంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు బయటకు విస్తరించాయి. - మిగతా 2 లో

## జాతీయ జెండాతో పాటు

# మీ అజెండా ఉండాలి



- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం
- విజయవాడలో కార్యక్రమం... హాజరైన సీఎం చంద్రబాబు
- ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని సీఎం పిలుపు
- జీవో నెంబర్ 3ను చట్టపరంగా కాపాడతామని ఆదివాసులకు భరోసా
- అరకు కాఫీ తరహాలో స్థానిక గిరిజన ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్
- ద్రౌపది ముర్ము స్ఫూర్తితో ఎదిగి దేశ నిర్మాణంలో భాగస్వాములు ద కావాలని యువతకు ఉద్బోధ

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. దేశభక్తి అంటే కేవలం సరిహద్దుల్లో పోరాడటం మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వృత్తిలో విజయం సాధించి, సమాజానికి సేవ చేయడమే నిజమైన దేశభక్తి అని ఉద్బోధించారు. ప్రతి ఒక్కరూ తమకంటూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా విజయవాడ అంబేద్కర్ కళావేదికలో జరిగిన సభకు చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... గిరిజన సమాజానికి సమగ్ర అభివృద్ధి, సంక్షేమంపై పలు కీలక హామీలు ఇస్తూ, వారి హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.సాధారణ ఆదివాసీ కుటుంబంలో పుట్టి, అనేక కష్టాలను అధిగమించి, దేశ ప్రథమ పౌరురాలిగా అత్యున్నత శిఖరాలను అధిరోహించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని చంద్రబాబు అన్నారు. ఆమె స్ఫూర్తితో గిరిజన యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. జాతీయ జెండాతో పాటు మీ అజెండా - మిగతా 2 లో

# సంపాదకీయం

## సముచిత తీర్పు



రోజూ ఐదువందలకు పైగా రోడ్డు ప్రమాదాలు జరిగే ఈ దేశంలో, యాభైఆరుశాతం వాహనాలు ఇన్సూరెన్స్ లేకుండా రోడ్లమీద యథేచ్ఛగా తిరుగుతున్నాయి. ఇవన్నీ సక్రమంగా రిజిస్టరై, రికార్డుల్లో ఫిట్‌గా ఉన్నవే. ప్రమాదాలు జరిగినప్పుడు బాధిత కుటుంబాలవారికి ఒక్కరూపాయి కూడా దక్కకుండా చేస్తున్న ఈ స్థితిని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించి, కొన్ని సూచనలు చేయడం బాగుంది. వాహనదారులు మోటారువాహనాల చట్టంలోని అత్యంత కీలకమైన నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తుంటే, వాటిని కచ్చితంగా అమలు చేయించడంలో అధికారులు విఫలమవుతున్న తరుణంలో, పెట్రోల్ బంకుల దగ్గరే ఈ స్థితిని సరిదిద్దాలన్నది సుప్రీంకోర్టు ఆలోచన. ఇన్సూరెన్స్ లేని వాహనాలకు పెట్రోల్ బంకుల దగ్గర చమురు నిరాకరించే విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలుచేయమని కేంద్రానికి కోర్టు చేసిన సూచన బాగుంది. ఇన్సూరెన్స్ సమస్యను తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు, ప్రమాదాల నివారణ మీద అధికదృష్టి పెట్టి, ప్రభుత్వాలను నిలదీసివుంటే మరింత బాగుండేదన్నది వేరే సంగతి. కానీ, మొత్తం రోడ్డుప్రమాదాల్లో దాదాపు నాలుగోవంతు ఇన్సూరెన్స్ లేని వాహనాలవల్లనే జరుగుతున్నాయి. బీమా ఉల్లంఘన మోటార్ వాహనాల చట్టంలోని అతికీలకమైన 146వ నిబంధన అసలు లక్ష్యాన్ని దెబ్బతీస్తున్నది. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ లేని వాహనాన్ని నడుపుతున్నవారికి పెనాల్టీలతో పాటు, జైలుశిక్ష కూడా విధించాలని చట్టం చెబుతూంటే, దానిని ఉల్లంఘించి వాహనాన్ని నడిపి యాక్సిడెంట్లు చేయడం ద్వారా వాహనదారులు ఎదుటివారికి తీవ్ర అన్యాయం చేస్తున్నారు. వాహన ప్రమాదాలు జరిగినప్పుడు బాధిత కుటుంబాలవారికి సత్వరమే పెద్దమొత్తంలో దక్కాల్సిన నష్ట పరిహారాన్ని దూరం చేస్తున్నారు. ఏళ్ళతరబడి న్యాయపోరాటాలు చేసినా ఫలితం దక్కని స్థితి బాధితులకు ఏర్పడుతోంది. బంకుల్లో పెట్రోల్ పోయడం మానేస్తే, ఇన్సూరెన్స్‌లేని వాహనాలను సులువుగా గుర్తించడమే కాక, వాహన యజమానికి కూడా తాను చెల్లుబాటయ్యే బీమా లేకుండానే వాహనాన్ని నడుపుతున్న విషయం తెలియచెప్పడం అవుతుందని కోర్టు అంటోంది. ఇలా గుర్తుచేయడం బాగున్నది కానీ, తాను ఇన్సూరెన్స్ లేని వాహనం నడుపుతున్నానని అత్యధికశాతం యజమానులకు తెలియదనుకోలేం. కోర్టు సూచనలు కచ్చితంగా అమలై, బంకుల్లో పెట్రోల్ పోయడం ఆగిన పక్షంలో తప్పనిసరిగా ఇన్సూరెన్స్ రెన్యువల్ చేసేవారి సంఖ్య హెచ్చుగా ఉంటుందన్నది వాస్తవం. ఇరవైయేళ్ళనాటి కేసుకు సంబంధించిన తీర్పులో సుప్రీంకోర్టు వెలిబుచ్చిన అభిప్రాయాలు, ఆదేశాలు సముచితమైనవి. 1996లో ప్రకాశంజిల్లా సింగరాయకొండ దగ్గర జరిగిన రోడ్డుప్రమాదంలో మరణించిన ఒక వ్యక్తి కుటుంబసభ్యులకు పరిహారం చెల్లించే విషయంలో జరిగిన అన్యాయాన్ని ఈ తీర్పు ప్రశ్నించింది. కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని కోల్పోయినందుకు బీమా కంపెనీనుంచి పదిలక్షల రూపాయల నష్టపరిహారాన్ని అతని కుటుంబసభ్యులు కోరితే, వాహనానికి బీమా ఉన్నా, వాహన యజమాని వ్యక్తిగత రిస్క్‌ను కవర్ చేసే అదనపు బీమా ప్రీమియం కట్టనందుకు ఈ పరిహారం కోరే అర్హత ఆ కుటుంబానికి లేదని ట్రైబ్యునల్ తేల్చేసింది. మూడేళ్ళ తరువాత హైకోర్టు బాధిత కుటుంబం పక్షాన తీర్పు వెలువరించి, నెలవారీ ఆదాయం ప్రాతిపదికన ఓ పదిలక్షలరూపాయలు పరిహారంగా చెల్లించాలని బీమా కంపెనీని ఆదేశించడంతో ఆ సంస్థ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఈ కేసులో హైకోర్టు తీర్పును సమర్థిస్తూ, వాహనంలో కూర్చున్న ప్రతీ వ్యక్తికీ బీమా కంపెనీలు కాంప్రహెన్సివ్ పాలసీ కింద పరిహారం చెల్లించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టంచేయడం సముచితం. వాహన బీమాకు సంబంధించి ధర్మాసనం జారీ చేసిన సూచనలను, మార్గదర్శకాలను అమలులోకి తీసుకురావడం ప్రభుత్వం విధి. ఇంటికి ఆధారమైన వ్యక్తి వాహన ప్రమాదంలో మరణిస్తే, ఆ కుటుంబం పడే వేదన, కష్టాలు ఊహకు అందనివి. వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగిపోతూ, వాహనదారుల మత్తువల్లనో, అలసటవల్లనో అధిక ప్రమాదాలు జరుగుతున్న రోజులివి. లైసెన్సులు లేని డ్రైవర్లను, ఇన్సూరెన్స్ లేని వాహనాలను నియంత్రించడం, ప్రమాదాలను నివారించడం ప్రభుత్వాల కర్తవ్యం.

## ఐక్యతే మన బలం క్విట్ ఇండియా స్ఫూర్తిపై పవన్ ట్వీట్

**మొదటిపేజీ తరువాయి -** చరిత్ర గతిని మార్చి, భారతీయ ఆత్మను మేల్కొల్పిన మహోన్నత ఘట్టం క్విట్ ఇండియా ఉద్యమమని ఆయన కొనియాడారు."1942 ఆగస్టు 8న మహాత్మా గాంధీ ఇచ్చిన 'డూ ఆర్ డై' (సాధించు లేదా మరణించు) పిలుపు కోట్లాది మంది భారతీయుల్లో అచంచలమైన దేశభక్తిని, ధైర్యసాహసాలను నింపింది. ఈ నినాదం స్వాతంత్ర్య పోరాటాన్ని ఉవ్వెత్తున ఎగసిన జాతీయోద్యమంగా మార్చింది" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మాతృభూమి విముక్తి కోసం ప్రాణత్యాగాలు చేసిన ఆ మహనీయులకు తాను శిరస్సు వంచి ప్రణమిల్లుతున్నట్లు తెలిపారు. భారతదేశ వాస్తవిక శక్తి ప్రజల ఐక్యతలో, సవాళ్లను అధిగమించాలనే సమష్టి సంకల్పంలోనే ఉందని ఈ ఉద్యమం మనకు గుర్తుచేస్తోందన్నారు. పటిష్టమైన, స్వయం సమృద్ధ, అభివృద్ధి చెందిన దేశాన్ని నిర్మించడం ద్వారానే ఆ వీరుల కలలకు, వారి త్యాగాలకు సరైన న్యాయం చేకూరుతుందని పవన్ కల్యాణ్ తన పోస్టులో వివరించారు.

## తిరుమలలో విపరీతమైన భక్తుల రద్దీ

**మొదటిపేజీ తరువాయి -** గోగర్భం డ్యామ్ సర్కిల్ సమీపంలోని ఆక్టోపస్ భవనం వరకు భక్తులు కిలోమీటర్ల మేర బారులు తీరిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి సుమారు 20 నుంచి 24 గంటల సమయం పడుతోందని అధికారులు వెల్లడించారు. నిన్న (ఆగస్టు 8) మొత్తం 87,658 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 40,606 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.13 కోట్లుగా నమోదైంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు 4.15 లక్షల లడ్డూలను విక్రయించగా, 3.09 లక్షల మందికి అన్నప్రసాదం అందించారు. వారాంతం కావడంతో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగినట్లు తెలుస్తోంది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ అధికారులు తాగునీరు, ఆహారం వంటి సౌకర్యాలు కల్పిస్తూ రద్దీని క్రమబద్ధీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. భారీ రద్దీ నేపథ్యంలో, తిరుమలకు వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని టీటీడీ సూచిస్తోంది.

## హైదరాబాద్‌లో 40 లక్షల ఓట్లు గల్లంతు?



**మొదటిపేజీ తరువాయి -** కొన్ని ప్రాంతాల్లో ఇది అత్యధికంగా ఉంది. ముఖ్యంగా సనత్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 2,54,030 ఓట్లు ఉండగా, వాటిలో ఏకంగా 1.16 లక్షల ఓట్లు (45.68%) రద్దయ్యే అవకాశం ఉందని అంచనా. అదేవిధంగా జూబ్లీహిల్స్‌లో 44.21%, ఎల్బీనగర్‌లో 42.19%, ఉప్పల్‌లో 40.05%, మహేశ్వరంలో 40.03% ఓట్లు జాబితా నుంచి తొలగిపోవచ్చని అధికారులు చెబుతున్నారు. అత్యల్పంగా ఇబ్రహీంపట్నంలో 21.43% ఓట్లు రద్దయ్యే అవకాశం ఉంది. రాబోయే రెండు రోజుల్లో ఈ సంఖ్యల్లో స్వల్ప మార్పులు మాత్రమే ఉండొచ్చని భావిస్తున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి, ఇతర అవసరాల కోసం ప్రతిరోజూ వేలాది మంది హైదరాబాద్‌కు వలస వస్తుంటారు. ఇక్కడే స్థిరపడి ఓటరుగా నమోదు చేసుకుంటారు. అయితే, ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఓటరు సర్వే జరుగుతున్న నేపథ్యంలో.. సొంత ఊరితో పాటు హైదరాబాద్‌లోనూ ఓటు హక్కు ఉన్నవారు తమ ఓటును సొంతూరిలోనే కొనసాగించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో నగరంలో ఎన్యుమరేషన్ ఫారాలను చాలామంది అధికారులకు తిరిగి ఇవ్వలేదని తెలుస్తోంది. ఇదే ఓట్ల సంఖ్య భారీగా తగ్గడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మరోవైపు కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమకు ఇప్పటికీ ఎన్యుమరేషన్ ఫారాలు అందలేదని లక్షలాది మంది ఓటర్లు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వారంతా ఆన్‌లైన్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సోమవారం గడువు ముగిసిన తర్వాత తుది లెక్కలు తేలనుండగా, ఆగస్టు 17న వెలువడనున్న ముసాయిదా జాబితాపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# జాతీయ జెండాతో పాటు మీ అజెండా ఉండాలి

**మొదటిపేజీ తరువాయి -** కూడా ఉండాలని పిలుపునిచ్చారు."సంకల్పం బలంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు. ద్రౌపది ముర్ము, అబ్దుల్ కలాం, బీఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్, నరేంద్ర మోదీ వంటి మహనీయులంతా సాధారణ కుటుంబాల నుంచి వచ్చినవారే. 'నేను ఏంటి? ఎలా ఎదగాలి? ఈ సమాజానికి, దేశానికి నేనేం ఇవ్వాలి?' అనే లక్ష్యంతో పనిచేయాలి. మీ విజయం దేశ విజయమవుతుంది.." అని ఆయన పేర్కొన్నారు. ఈ స్ఫూర్తిని వ్యాపింపజేసేందుకు ఆగస్టు 9 నుంచి 15 వరకు 'అనే నేను' పేరుతో ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. గిరిజన ప్రాంతాల్లోని ఆర్థిక స్వావలంబనపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. తాను 25 ఏళ్ల క్రితం ఒక చిరు ప్రయత్నంగా ప్రారంభించిన అరకు కాఫీ, నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచడాన్ని ఆయన గుర్తుచేశారు. "అరకు కాఫీకి నేనే పేరు పెట్టాను. దానిని మార్కెటింగ్ చేసి, ప్రధాని నరేంద్ర మోడీ నుంచి ఆస్ట్రేలియా ప్రధాని వరకు బహుకరించి, గ్లోబల్ బ్రాండ్‌గా నిలబెట్టాను. ఇవాళ పారిస్‌లో కూడా అరకు కాఫీ స్టాళ్లు ఉన్నాయి" అని గర్వంగా ప్రకటించారు. ఇదే స్ఫూర్తితో సీతంపేట పసుపు, రంపచోడవరం రబ్బర్, పార్వతీపురం పైనాపిల్, తేనె, తాటిబెల్లం వంటి స్థానిక ఉత్పత్తులకు విలువ జోడించి, బ్రాండింగ్ చేసి, మార్కెటింగ్ చేసే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లోని రైతులు పండించే ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ సంస్థలతో 19 అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి నాలుగు కీలక రంగాలపై దృష్టి పెడుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, ఆదాయ మార్గాల పెంపునకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. మౌలిక వసతులు: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో 2,336 గిరిజన ఆవాసాలకు మిషన్ మోడ్‌లో రోడ్ కనెక్టివిటీ కల్పిస్తామన్నారు. 'జల్ జీవన్ మిషన్' కింద 2027 డిసెంబర్ నాటికి ప్రతి గిరిజన ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. మారుమూల గ్రామాలకు సైతం టెలికాం కనెక్టివిటీ అందించి, డోలీ మోతలు లేని సమాజాన్ని నిర్మిస్తామన్నారు. విద్య: 'తల్లికి వందనం' కింద 4.92 లక్షల మంది గిరిజన విద్యార్థులకు రూ.650 కోట్లు అందించామని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. విశాఖలోని మేకవారిపాలెంలో 600 మంది విద్యార్థులతో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేసి, ఐఐటీ వంటి జాతీయ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఏటా కనీసం 100 మంది గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయి సంస్థల్లో సీట్లు సాధించడమే లక్ష్యమన్నారు. వైద్యం: పాడేరులో మెడికల్ కాలేజీతో పాటు పార్వతీపురం, రంపచోడవరం, శ్రీశైలం వంటి ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మిస్తామన్నారు. 'సంజీవిని' ప్రాజెక్ట్ ద్వారా ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేస్తామని, సికిల్ సెల్ అనీమియా బాధితులకు రూ.10,000 పింఛను అందిస్తూ, వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రకటించారు. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు స్థానికులకే దక్కాలనే ఆశయంతో ఎన్టీఆర్ హయాంలో పురుడుపోసుకుని, తాను 2000 సంవత్సరంలో తీసుకొచ్చిన జీవో నెంబర్ 3ను కాపాడతామని చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. సుప్రీంకోర్టులో ఈ జీవోను కొట్టివేయడానికి గత ప్రభుత్వ వైఫల్యమే కారణమని విమర్శించారు. "ఈ జీవోను చట్టపరంగా, రాజ్యాంగబద్ధంగా నిలబడేలా పటిష్టమైన కార్యాచరణ రూపొందిస్తాం. ఆదివాసుల హక్కుల పరిరక్షణకు ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆవేశంతో కాకుండా ఆలోచనతో, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని దీనిపై ముందుకు వెళతాం" అని భరోసా ఇచ్చారు. గిరిజన ప్రాంతాలను కేవలం వెనుకబడిన ప్రాంతాలుగా కాకుండా, అపార అవకాశాలున్న ప్రాంతాలుగా చూస్తున్నామని, అక్కడి పచ్చదనం, స్వచ్ఛమైన వాతావరణాన్ని ఉపయోగించుకుని టూరిజం హబ్‌లుగా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రతి గిరిజన ఇల్లు 'అతిథి గృహం'గా మారాలని, తద్వారా ప్రపంచానికి ఆతిథ్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి 'వికసిత్ భారత్', 'స్వర్ణాంధ్రప్రదేశ్' లక్ష్యాలను సాధించడంలో ఆదివాసీలు కీలక పాత్ర పోషించాలని, వారి సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# ఏదో ఒకరోజు అమిత్ షా సమాధానం చెప్పక తప్పదు

**మొదటిపేజీ తరువాయి -**
ఇప్పుడు తనకు ఏదారీ కనిపించటం లేదని అతడు తనతో చెప్పినట్లు తెలిపారు. ఇది ఆ విద్యార్థి వైఫల్యం కాదని, అతని కష్టానికి తగిన ప్రతిఫలం ఇవ్వలేని ప్రస్తుత వ్యవస్థ వైఫల్యమని ఆయన విమర్శించారు. యువతే దేశానికి వెలుగు అని, వారికి తమ పార్టీ పూర్తి అండగా ఉంటుందని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. ఇండియన్ యూత్ కాంగ్రెస్ (ఐవైసీ) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సంస్థ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశపు గొప్ప బలం యువతేనని ఆయన పేర్కొన్నారు. అలాగే, యువ భారతీయులకు తమ గళాలను, ఆందోళనలను వినిపించడానికి, తమ హక్కులు, కలలు, ఆకాంక్షల కోసం పోరాడటానికి ఒక వేదికను అందించడంలో ఐవైసికి ఉన్న ప్రాముఖ్యాన్ని ఎక్స్‌లో ప్రస్తావించారు."ఐవైసీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఇండియన్ యూత్ కాంగ్రెస్ సభ్యులందరికీ శుభాకాంక్షలు. భారతదేశపు అతిపెద్ద బలం దాని యువతే. యువ భారతీయులకు ఒక వేదికను అందించడంలో ఐవైసికి అద్భుతమైన చరిత్ర ఉంది. యువత తమ గొంతుకనను వినిపించడంలో, వారి సమస్యలను లేవనెత్తడంలో, వారికి వ్యతిరేకంగా రూపొందించిన వ్యవస్థతో పోరాడడంలో, ఐవైసి ప్రతి అడుగులోనూ వారికి అండగా నిలుస్తుంది" అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. కాగా, రాహుల్ గాంధీ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లోని కెపి గ్రౌండ్‌లో శనివారం 'ఛత్రోన్ కీ గూంజ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ సమస్యపై కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. భారత జాతీయ కాంగ్రెస్ యువజన విభాగమైన భారత యువజన కాంగ్రెస్ 1960 ఆగస్టు 9న స్థాపించారు. ఈ పార్టీ గతంలో కాంగ్రెస్ పార్టీలోనే ఒక భాగంగా ఉండేది. ఆ తర్వాత,అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ దీనిని ఒక అనుబంధ సంస్థగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం, ఈ సంస్థలో రెండు కోట్లకు పైగా సభ్యులు ఉన్నారు. ఈ సంస్థ 'శక్తి సూపర్ షీ' అనే ప్రచారంతో సహా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది0. అయితే, వీటి ప్రధాన లక్ష్యం కాంగ్రెస్ పార్టీతో మహిళల దేశవ్యాప్త అనుబంధాన్ని, భాగస్వామ్యాన్ని పెంపొందించడం, బలోపేతం చేయడం. ఇతర కార్యక్రమాల్లో భారత్ జోడో నాయకత్వ కార్యక్రమం, పెహ్లో ఓటు, ఇందిరా ఫెలోషిప్, యువత హక్కుల కోసం గళం విప్పడం వంటివి ఉన్నాయి. ప్రస్తుతం ఉదయ భాను చిబ్, కృష్ణ అల్లవారు ఈ సంస్థకు అధ్యక్షుడిగా, సంయుక్త కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం(ఆగస్టు 9) సందర్భంగా దేశంలోని ఆదివాసీ సోదర సోదరీమణులందరికీ రాహుల్ గాంధీ ఎక్స్‌లో శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివాసీలే దేశపు అసలైన యజమానులని, వారి విభిన్న సంస్కృతి, సంప్రదాయాలు భారతదేశానికి లభించిన అమూల్యమైన వారసత్వ సంపదగా ఆయన కొనియాడారు. భూమి, అటవీ సంపదపై వారికి ఉన్న హక్కులతో పాటు, వారి అస్తిత్వం ఆత్మగౌరవం కోసం సాగే పోరాటంలో వారికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

# బ్రహ్మోస్‌కు ప్రపంచవ్యాప్తంగా పెరిగిన గిరాకీ

**మొదటిపేజీ తరువాయి -**
కొన్ని దేశాలతో భారీ ఒప్పందాలు కూడా ఖరారయ్యాయి. 'ది వీక్' పత్రిక ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం, ఈ క్షిపణి కొనుగోలుకు చర్చలు వేగవంతమయ్యాయి. 2022 జనవరిలో ఫిలిప్పీన్స్‌తో 375 మిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకున్న భారత్, ఆపరేషన్ సిందూర్ తర్వాత మరిన్ని విజయాలు సాధించింది. వియత్నాం సుమారు 629 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని ఖరారు చేయగా, ఇండోనేషియా కూడా 200 నుంచి 300 మిలియన్ డాలర్ల మధ్య విలువైన ఒప్పందాన్ని ఖరారు చేసుకుంది. యూరప్, పశ్చిమాసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికాకు చెందిన డజనుకు పైగా దేశాలు కూడా బ్రహ్మోస్ కొనుగోలుపై ఆసక్తి వ్యక్తం చేస్తున్నాయి. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే), పాకిస్థాన్‌లోని కీలక ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా, భారత వాయుసేన విమానాలు అంతర్జాతీయ సరిహద్దు దాటకుండానే సుమారు 15 బ్రహ్మోస్ క్షిపణులను పాక్ సైనిక స్థావరాలపై ప్రయోగించాయి. ఈ దాడుల కచ్చితత్వం, తీవ్రత పాకిస్థాన్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. ముఖ్యంగా, పాకిస్థాన్ మోహరించిన చైనా నిర్మిత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను బ్రహ్మోస్ విజయవంతంగా ఛేదించడం ఒక కీలక పరిణామం. ఈ క్షిపణి దాడుల ధాటికి తట్టుకోలేకే పాకిస్థాన్ వెంటనే కాల్పుల విరమణకు పిలుపునిచ్చిందని నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామమే బ్రహ్మోస్‌పై ప్రపంచ దేశాలకు నమ్మకాన్ని పెంచింది. పెరుగుతున్న దేశీయ, అంతర్జాతీయ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని భారత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచింది. హైదరాబాద్, నాగ్‌పూర్, పిలానీలతో పాటు ఇటీవల లక్నోలో కొత్తగా ప్రారంభించిన ప్లాంట్‌లో కూడా ఉత్పత్తి మొదలైంది. ప్రస్తుతం ఈ నాలుగు కేంద్రాల్లో నెలకు కనీసం నాలుగు క్షిపణులను తయారు చేసే సామర్థ్యం ఉండగా, దీనిని మరింత విస్తరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత నావికాదళంలోని ప్రతి ప్రధాన యుద్ధనౌక, వాయుసేనలోని ప్రతి ఫైటర్ జెట్‌ను బ్రహ్మోస్‌తో సన్నద్ధం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. బ్రహ్మోస్ ప్రాజెక్టుకు 1997లో అంకురార్పణ జరిగింది. అప్పటి డీఆర్‌డీఓ చీఫ్ ఏపీజే అబ్దుల్ కలాం నేతృత్వంలోని ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భూమికి సమీపంగా ప్రయాణించే క్రూయిజ్ క్షిపణి లోటును గుర్తించారు. ఈ క్రమంలోనే రష్యాతో కలిసి బ్రహ్మోస్ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. డీఆర్‌డీఓ, రష్యాకు చెందిన ఎన్‌పీఓ మషినోస్ట్రోయేనియా సంయుక్త భాగస్వామ్యంతో 'బ్రహ్మోస్ ఏరోస్పేస్' ఏర్పడింది. తొలినాళ్లలో 'పీజే-10' అనే కోడ్‌నేమ్‌తో అత్యంత రహస్యంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేశారు. మరోవైపు, బ్రహ్మోస్‌లో కొత్త వేరియంట్ల అభివృద్ధిపై కూడా శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. నీటి అడుగున ప్రయోగించే సామర్థ్యమున్న వెర్షన్, తేలికైన మినీ వేరియంట్‌ను రూపొందించే పనులు కొనసాగుతున్నాయి. భవిష్యత్తులో పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో బ్రహ్మోస్‌ను తయారు చేసి, తేజస్, ఎల్‌సీఏ ఎంకే 2 వంటి దేశీయ యుద్ధ విమానాలకు అనుసంధానించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది రక్షణ రంగంలో స్వావలంబన సాధించే దిశగా భారత్ చేస్తున్న ప్రయత్నాలకు మరింత బలాన్ని చేకూర్చనుంది.

## రుద్రమదేవి నుంచి శ్రీకృష్ణదేవరాయల వరకు

**మొదటిపేజీ తరువాయి -** సోకినప్పుడు అమ్మవారిని శాంతింపజేయడానికి ఈ పండుగ మొదలైందని చాలామంది భావిస్తారు. కానీ, అంతకు కొన్ని వేల సంవత్సరాల ముందు నుంచే తెలంగాణ గడ్డపై ఈ సంప్రదాయం ఉందని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. చరిత్ర పరిశోధకుడు డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణ ప్రకారం, సుమారు 3 వేల ఏళ్ల కిందటే ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనం సమర్పించే ఆచారం ఉంది. దీనికి నిదర్శనంగా కామారెడ్డి జిల్లా మరంద్రాళ్ల తండా సమీపంలోని రాతి గుట్టల్లో స్త్రీలు నెత్తిన బోనం ఎత్తుకున్న శిల్పాలు కనుగొన్నారు. అంతేకాకుండా, సుమారు 1600 ఏళ్ల కిందటి విష్ణుకుండినుల కాలం నాటి 'గర్భాపాత్ర' కూడా మేడ్చల్ జిల్లా కీసరగుట్ట వద్ద లభించింది. కాకతీయుల పాలనలోనూ బోనాలు వైభవంగా జరిగాయి. కాకతీయ రాణి రుద్రమదేవి తన కుమార్తె ముమ్మడమ్మకు సంతానం కలగాలని మొగిలిచర్లలోని ఏకవీరాదేవికి బోనం సమర్పించినట్లు ఏకామ్రనాథుడి 'ప్రతాప చరిత్ర' గ్రంథంలో ఉంది. పండితారాధ్య చరిత్రలో కూడా ఈ ఉత్సవాల ప్రస్తావన కనిపిస్తుంది. బోనాల పండుగ గురించి అధికారికంగా ప్రస్తావించిన మొట్టమొదటి శిలాశాసనం శ్రీకృష్ణదేవరాయల కాలం నాటిది. క్రీ.శ. 1516 మే 4న వేయించిన ఈ శాసనం ప్రస్తుతం హైదరాబాద్‌లోని రాష్ట్ర పురావస్తు ప్రదర్శనశాలలో ఉంది. తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని గొబ్బూరులో లభించిన ఈ శాసనంలో, బోనాల పండుగ నిర్వహణ కోసం రాజ్యం నుంచి చెల్లించాల్సిన పన్నులను రద్దు చేస్తున్నట్లు స్పష్టంగా పేర్కొన్నారు. హైదరాబాద్ నిర్మాత మహమ్మద్ కులీ కుతుబ్ షా కాలంలోనూ బోనాల సంప్రదాయం కొనసాగింది. శాలిబండ గ్రామంలో బోనాలు జరుపుకుంటున్న దృశ్యాలున్న ఒక సూక్ష్మ చిత్రపటం దీనికి సాక్ష్యంగా నిలుస్తోంది. గోల్కొండ కోటలోని జగదాంబిక ఆలయంలో గత 400 ఏళ్లుగా ఆషాఢ బోనాలు నిరంతరాయంగా జరుగుతున్నాయి. ఈ ఆధారాలన్నీ పరిశీలిస్తే, 1816లో ప్లేగు వ్యాధి నిర్మూలన కోసం ప్రారంభమైందన్న వాదన కంటే ఎంతో ముందే బోనాల పండుగ తెలంగాణ జనజీవనంలో, సంస్కృతిలో భాగమైందని స్పష్టమవుతోంది.

## నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ వద్దు.. విద్యార్థుల నిరసన!

**మొదటిపేజీ తరువాయి -** యాజమాన్యానికి ఒక లేఖ రాశారు. ఈ పరిణామం తెలంగాణ న్యాయ విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే, 2026 బ్యాచ్ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించే ప్రతిపాదనను విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఢిల్లీలో జరిగిన నీట్ నిరసనలపై సుప్రీంకోర్టులో జూలై 22న జరిగిన విచారణ సందర్భంగా సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం చేసిన వ్యాఖ్యలే ఈ నిరసనకు ప్రధాన కారణం. ఆ రోజు విచారణ సందర్భంగా, నిరసనకారులపై పోలీసుల చర్యకు సంబంధించిన వీడియోలపై సుమోటో విచారణ చేపట్టడానికి ధర్మాసనం నిరాకరించింది. ఈ క్రమంలో సీజేఐ, "వీడియోలు చూసే ఆసక్తి మాకు లేదు," "మా సమయాన్ని, మీ సమయాన్ని వృథా చేయకండి" వంటి వ్యాఖ్యలు చేశారని విద్యార్థులు తమ లేఖలో పేర్కొన్నారు. సీజేఐ వ్యాఖ్యలు అసంబద్ధంగా, బాధ్యతారహితంగా ఉన్నాయని, అందుకే ఆయనను స్నాతకోత్సవానికి పిలవరాదని వారు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్‌కు మద్దతుగా విద్యార్థులు ఇప్పటికే ఒక పూట భోజనం చేయకుండా నిరసన తెలిపారు. తమ అభ్యర్థనను యాజమాన్యం పట్టించుకోకపోతే, వారం రోజుల నోటీసు ఇచ్చి ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అయితే, నల్సార్ యాజమాన్యం స్నాతకోత్సవం తేదీని గానీ, ముఖ్య అతిథిని గానీ అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. కానీ, ప్రతి ఏటా సీజేఐని స్నాతకోత్సవానికి ఆహ్వానించడం నల్సార్‌లో ఒక సంప్రదాయంగా వస్తోంది. కాగా, సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ విద్యార్థుల నిరసనను ఎదుర్కోవడం ఇది రెండోసారి. ఈ నెల మొదట్లో ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్)లో జరగాల్సిన 86వ స్నాతకోత్సవానికి కూడా ఆయనే ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉంది. అయితే, ఎస్ఎఫ్ఐ అనుబంధ విద్యార్థులు నిరసన తెలిపే అవకాశం ఉందన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో ఆ కార్యక్రమాన్ని చివరి నిమిషంలో వాయిదా వేశారు. ఇప్పుడు టిస్ తర్వాత నల్సార్‌లోనూ అదే పరిస్థితి పునరావృతం కావడం గమనార్హం. విద్యార్థుల లేఖతో నల్సార్ యాజమాన్యం ఇప్పుడు ఇరకాటంలో పడింది.

# ట్రంప్ కొత్త హెయిర్‌స్టైల్‌పై రచ్చ.. సోషల్ మీడియాలో మీమ్స్ వెల్లువ!

**మొదటిపేజీ తరువాయి -** ప్రసంగంలో ఆర్థిక విజయాల గురించి మాట్లాడుతున్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం ఆయన కొత్త హెయిర్‌స్టైల్‌పైనే చర్చ మొదలైంది. ఆగస్టు 5న లాస్ వెగాస్‌లోని రెడ్ రాక్ క్యాసినోలో జరిగిన కార్యక్రమంలో ట్రంప్ పాల్గొన్నారు. అయితే, ఆయన ప్రసంగం కంటే ఆయన తలకట్టే పెద్ద హాట్ టాపిక్‌గా మారింది. నెటిజన్లు ఆయన కొత్త లుక్‌పై మీమ్స్, జోకులతో హోరెత్తించారు. కొందరు "ట్రంప్ పెద్ద జుట్టు మీమ్స్ హద్దులు దాటాయి" అని కామెంట్ చేయగా, మరికొందరు "ట్రంప్ వయసు వెనక్కి వెళ్తోందనడానికి ఇదే నిదర్శనం. ఆయన హెయిర్ అద్భుతంగా ఉంది" అని ప్రశంసించారు. మరోవైపు ట్రంప్ విగ్గు పెట్టుకున్నారని సెటైర్లు పేలాయి. "ది న్యూ ట్రంప్ హెయిర్ సీరమ్" పేరుతో ఒక ఏఐ-జనరేటెడ్ వీడియో కూడా 'ఎక్స్' (ట్విట్టర్)లో వైరల్ అయింది. ఈ నేపథ్యంలో ట్రంప్ తీరపై ఆయన సోదరుడి కుమార్తె మేరీ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ కొత్త హెయిర్‌స్టైల్ 'రుడాల్ఫ్ ది రెడ్-నోస్డ్ రెయిన్‌డీర్' యానిమేషన్ చిత్రంలోని 'హెర్మీ ది ఎల్ఫ్' పాత్రను గుర్తు చేస్తోందని ఆమె ఎద్దేవా చేశారు. అయితే, ఆ జుట్టు బాగుందా లేదా అనే విషయం తనకు అనవసరమని స్పష్టం చేశారు. అంతటితో ఆగకుండా ట్రంప్ తన జుట్టుపై చూపిస్తున్న శ్రద్ధ.. అల్జీమర్స్ బాధపడుతూ చనిపోయిన తన తండ్రి ఫ్రెడ్ ట్రంప్‌ను గుర్తు చేస్తోందని మేరీ ఆవేదన వ్యక్తం చేశారు. "మా నాన్నకు అల్జీమర్స్ వచ్చిన తర్వాత తన జుట్టు రాలిపోవడంపై తీవ్రంగా ఆందోళన చెందేవారు. సరిగ్గా సరిపోని విగ్గు ధరించేవారు. తన జుట్టుకు, మీసానికి రంగు వేసుకునేవారు. ఇప్పుడు ట్రంప్ ను చూస్తుంటే ఆయనే గుర్తొస్తున్నారు" అని మేరీ ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో ట్రంప్ హెయిర్‌స్టైల్ వ్యవహారం మరింత చర్చనీయాంశంగా మారింది.



## భక్తుల పాలిట కొంగు బంగారం మూసాపేట్ చిత్తారమ్మ తల్లి : బండి రమేష్






**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 9:** ఆషాఢమాస బోనాల పండగ చివరి ఆదివారం సందర్భంగా భక్తుల రాకతో మూసాపేట చిత్తారమ్మ తల్లి దేవాలయంలో పండుగ శోభ సంతరించుకుంది. ఆలయకమిటీ ఆహ్వానం మేరకు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్,టీపీసీసీ ఉపాధ్యక్ష్యులు బండి రమేష్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ నిర్వహకులతో కలిసి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే తల్లి చిత్తారమ్మ తల్లి అని, రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో,ప్రతి పథకం అర్హులైన పేదవారికి అందాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కూకట్పల్లి బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు ,డివిజన్ అధ్యక్షులు సంతోష్,శంకర్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏల్లేష్ యాదవ్,నరసింహులు యాదవ్,ప్రభాకర్ రావు,చప్పిడి భాస్కర్,కొండల్ రజనీకాంత్,మల్లేష్ యాదవ్, చిన్నారావ్ ,యువజన కాంగ్రెస్ నాయకులు బాలరాజు,అమీర్,శ్రవణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మూసాపేట్ చిత్తారమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్న మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 9:** మూసాపేట్ శ్రీ శ్రీ శ్రీ చిత్తారమ్మ తల్లి అమ్మవారిని మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ మున్నూరు కాపు సంఘం ప్రతినిధులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మూసాపేట్ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఆలయానికి విచ్చేసిన మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ కి ఆలయ కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికి, అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తూము శ్యామ్ సుందర్, జిల్లా జీత్ రావు, శ్రీధర్ ,సక్కూరి బాబు రావు, ఉప్పు వేణు,బాశెట్టి ప్రభాకర్, సప్పిడి వెంకటేష్,సప్పిడి శ్రీనివాస్, తూము మధు,మహేష్, కిరణ్,తూము మనోజ్,రామకృష్ణ , మున్నూరు కాపు సంఘం నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాగం నాగేందర్ యాదవ్ జన్మదినవేడుకలు...కొండాపూర్ ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ





**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, ఆగస్టు 9:** శేరిలింగంపల్లి తాజా మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ యువజన నాయకులు చింతకింది రవీందర్ గౌడ్, దేవులపల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో మొదటగా రాగం నాగేందర్ యాదవ్ తో జన్మదిన కేకును కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదినం సందర్భంగా కొండాపూర్ ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల గుండెల్లో నిలిచే నాయకుడు రాగం నాగేందర్ యాదవ్ అని అన్నారు. ప్రతీ సమస్యను తన సమస్యగా భావించి పరిష్కరించడంతో పాటు శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ గా రెండు సార్లు గెలిచి అభివృద్ధి పథంలో తీసుకెళ్లారన్నారు. పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తూ అన్ని వర్గాల వారికి అండగా నిలుస్తున్నారన్నారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాగం నాగేందర్ యాదవ్ ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ఉండాలని అందరి ఆశీస్సులు ఉండేలా ప్రతి ఏటా పలు సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.

# భారీగా పడిపోయిన చికెన్ ధరలు




నిజం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు 9: గత కొంతకాలంగా సామాన్యుడిపై గుదిబండలా మారిన చికెన్ ధరలు దిగొచ్చాయి. గత నెలలో రూ. 300 వరకు చేరుకున్న కిలో చికెన్ ఇప్పుడిప్పుడే దిగొస్తోంది. చికెన్ ధరలతో పాటు కోడి గుడ్డు ధర కూడా తగ్గింది.సండే రోజు చికెన్ ప్రియులకు ఇది శుభవార్తే అని చెప్పొచ్చు. రెండు తెలుగు రాష్ట్రాల్లో దాదాపు ఒకే రేటు ఉంటుంది. తెలంగాణ ప్రాంతంలో ఉండే ధరే ఆంధ్రప్రదేశ్‌లోనూ ఉంటుంది. కాకపోతే ఒక పది రూపాయాల వ్యత్యాయం వరకూ ధరల్లో తేడా ఉండొచ్చు. హైదరాబాద్, విజయవాడ మార్కెట్‌లో చికెన్ ధరలు సామాన్యుడికి సానుకూలంగానే ఉన్నాయి. హైదరాబాద్ జోన్‌లో కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ. 240 ఉండగా, స్కిన్ చికెన్ రూ. 212 ఉంది. రిటైల్ లైవ్ బర్డ్ రూ. 137గా ఉంది, రైతు ధర రూ. 110 పలుకుతోంది. విజయవాడ జోన్‌లో కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ. 250గా ఉంది. తెలంగాణ ప్రాంతంతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌లో ఒక పది రూపాయలు ఎక్కువగానే ఉంది. విజయవాడలో కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ. 250 ఉండగా, డ్రస్డ్ చికెన్ రూ. 223గా ఉంది. ఇక ఫారమ్ దగ్గర లైవ్ బర్డ్ రూ. 117, రిటైల్ లైవ్ బర్డ్ రూ. 144 పలుకుతోంది. తెలంగాణలో బోనాల సందర్భంగా ఏపీకి చెందిన కోళ్లు కూడా అక్కడికే ఎక్కువ ఎగుమతి అవుతున్నాయి. గుంటూరులో కిలో చికెన్ రూ. 280.. కడప, మార్కాపురం జిల్లాల్లో రూ. 260 వరకూ ఉండటం విశేషం. ఇక హైదరాబాద్ జోన్‌లో 12 గుడ్ల రిటైల్ ధర రూ. 74గా ఉండగా.. విజయవాడ జోన్‌లో రూ. 80 ఉంది. ఇటీవల కాలంలో ఒక్కో కోడి గుడ్డు ధర రూ. 10 వరకూ చేరుకోవడంతో మధ్యతరగతి వ్యక్తి ఇబ్బందిపడ్డాడు. అయితే చికెన్ ధరలతో పాటు ఇప్పుడు కోడిగుడ్డు ధర కూడా తగ్గింది. ఇప్పుడు ఒక్కో కోడి గుడ్డు ధర రూ. 6 నుంచి రూ. 7 మధ్య పలుకుతోంది. దిగుబడి ఎక్కువగా రావడంతో ధరలు తగ్గినట్టు వ్యాపారులు చెబుతున్నారు.

## ఆషాడమాస బోనాల పండుగ సందర్భంగా మీరాలం మండిలోని మహంకాళి అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున నూతన పట్టువస్త్రాలు సమర్పించిన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్





**నిజం న్యూస్ హైదరాబాద్ ఆగస్టు 9:** ఆలయానికి చేరుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కి పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, సభ్యులు, వేద అర్చకులు, స్థానిక నాయకులు. పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ. ఆషాఢ బోనాల ఉత్సవాల సందర్భంగా భక్తులకు నా శుభాకాంక్షలు. శ్రీ మహంకాళి అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు సమర్పించడం ఆనందంగా ఉన్నది. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి. వర్షాలు బాగా కురిసి గత ఏడాది లాగే ఈ సంవత్సరం కూడా పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నాను. అమ్మవారి దయతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసే శక్తి సామర్థ్యాలను వారికి ఇవ్వాలని కోరుకున్నాను. రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఏర్పాట్లు కూడా చాలా బాగున్నాయి. భక్తులందరు అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకోవాలని కోరుకుంటున్నాను.

# యువతే కాంగ్రెస్‌కు వెన్నెముక

### ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ



దేవరకొండ, **ఆగస్టు 09 నిజం న్యూస్:** యువతే కాంగ్రెస్ పార్టీకి వెన్నెముకని, ప్రజాసేవే యువజన కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమని దేవరకొండ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ అన్నారు. యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం దేవరకొండలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ప్రసూతి అనంతరం చికిత్స పొందుతున్న బాలింతలను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కిన్నెర హరికృష్ణ మాట్లాడుతూ.. యువతను రాజకీయంగా, సామాజికంగా చైతన్యవంతులను చేసి ప్రజాసేవ వైపు నడిపించడమే యువజన కాంగ్రెస్ లక్ష్యమన్నారు. యువత రాజకీయాల్లోకి రావడం పదవుల కోసం కాకుండా ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేసే బాధ్యతను స్వీకరించడమేనని అన్నారు.గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రతి గ్రామంలో యువతను ఏకం చేసి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు యువతకు అందుతున్న అవకాశాలను వారికి చేరవేయాలని కోరారు. పేదలు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, రైతులు, కార్మికులకు అండగా నిలిచి ప్రజాసేవలో యువజన కాంగ్రెస్ ముందుండాలని అన్నారు.ఆసుపత్రిలో బాలింతలను పరామర్శించి పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు అందించడం వంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని హరికృష్ణ తెలిపారు. యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఐక్యంగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు మేడ సైదులు, నేనావత్ మోతిలాల్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కేతావత్ రమేష్, ప్రధాన కార్యదర్శులు ఏకుల అంబేద్కర్, ఉమేర్ ఖాషీం, దుబ్బ చరణ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ నాగటి హరీష్, దేవరకొండ మండల అధ్యక్షుడు ముకురోజు రాజు, చందంపేట మండల సాయి రాథోడ్, నేరడుగొమ్ము అధ్యక్షుడు నీలం ఆంజనేయులు యాదవ్, పీఏపల్లి అధ్యక్షుడు రమేష్ నాయక్, దేవరకొండ పట్టణ అధ్యక్షుడు మహ్మద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మంత్రి అడ్లూరి




బంజారాహిల్స్ **ఆగస్టు 09 నిజం న్యూస్:** గిరిజనుల విద్య, హక్కులు, సంస్కృతి పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం గిరిజన సంక్షేమానికి రూ.18 వేల కోట్లకు పైగా నిధులు హైదరాబాద్ ఆదివాసీ సమాజం చేసిన త్యాగాలను స్మరించుకుంటూ వారి హక్కులను కాపాడటంతో పాటు ఆత్మగౌరవం, విద్య, ఉపాధి, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి అడ్లూరి తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో బంజారాహిల్స్ లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి అడ్లూరి పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఇందులో విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం మెరుగుపడేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. విద్యార్థులకు అందించే డైట్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచడంతో పాటు నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు త్వరలో మరింత మెరుగైన నాణ్యత కలిగిన కాస్ట్యూమ్స్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గిరిజన విద్యార్థులు పాఠశాల విద్యతోనే పరిమితం కాకుండా ఉన్నత విద్య, ఉన్నత చదువుల వరకు అత్యుత్తమంగా రాణించేలా ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రి అన్నారు. రాష్ట్ర గిరిజన విద్యార్థులకు సంబంధించిన పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ బకాయిల విడుదలకు చర్యలు తీసుకుంటామని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి ఇటీవల హామీ ఇచ్చారని తెలిపారు.

### గిరిజన హక్కులు, సంస్కృతి పరిరక్షణకు ప్రాధాన్యం

గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ బీఎం సంతోష్ మాట్లాడుతూ, గిరిజనుల అటవీ హక్కుల పరిరక్షణ, విద్యాభివృద్ధి, గిరిజన సంస్కృతి--సంప్రదాయాల పరిరక్షణ, మహిళల గౌరవం, సాధికారత, ఆరోగ్యం, అభివృద్ధి వంటి అంశాలకు శాఖ ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందన్నారు.

## ఐఫోన్ లవర్స్‌కు గుడ్‌న్యూస్ త్వరలోనే
# ఆపిల్ నుంచి మడతబెట్టేఫోన్ వచ్చేస్తోంది



మార్కెట్‌లో ఆపిల్ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉన్నది. ముఖ్యంగా ఐఫోన్లకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్‌లో మొబైల్ కంపెనీలు ఫోల్డబుల్ ఫోన్లపై దృష్టి సారిస్తున్నాయి. ఇప్పటి వరకు శామ్‌సంగ్, వన్‌ప్లస్ తదితర కంపెనీలు ఫోల్డబుల్ మొబైల్స్‌ని పరిచయం చేశాయి. ఆపిల్ మాత్రం ఫోల్డబుల్‌పై దృష్టి మాత్రం సారించలేదు. ప్రస్తుతం కంపెనీ ఫోల్డబుల్ మోడల్‌పై దృష్టి సారించినట్లు సమాచారం. అయితే, కంపెనీ అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ.. ఆపిల్ తొలి ఫోల్డబుల్ ఐఫోన్‌ని 2026 నాటికి లాంచ్ చేయనున్నదని ఓ నివేదిక తెలిపింది. ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్స్ గత కొద్దిరోజులుగా స్థిరమైన వృద్ధిని సాధించింది. ఈ రంగంలో శాంసంగ్, హువావే, మోటరోలా తదితర ప్రధాన కంపెనీలు ముందున్నాయి. శామ్‌సంగ్ జెడ్-సిరీస్‌తో మార్కెట్‌లో ముందంజలో ఉన్నది. ప్రతి కొత్త వెర్షన్‌తో డిజైన్‌తో పాటు క్వాలిటీని సైతం మెరుగుపరుస్తూ వస్తున్నది. ఆపిల్ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేస్తుందన్న వార్త వినియోగదారుల్లో ఉత్సాహాన్ని పెంచింది. ఆపిల్ ఫోల్డబుల్ ఐఫోన్ మార్కెట్లో కొత్త అవకాశాలను తెరిచి, యూజర్లకు సరికొత్త ఎక్స్‌పీరియన్స్‌ను అందించనుందని నివేదిక పేర్కొంది. ఇటీవల డీఎస్‌సీసీ (డిస్‌ప్లే సప్లై చైన్ కన్సల్టెంట్స్) నివేదిక 2019 నుంచి 2023 వరకు ప్రతి సంవత్సరం 40 వృద్ధి చెందుతున్న తర్వాత.. 2024లో మార్కెట్ కేవలం 5శాతం పెరుగుతుందని అంచనా వేస్తూ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్ సవాళ్లను హైలైట్ చేసింది. 2024లో థర్డ్ క్వార్టర్‌లో ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ డిస్‌ప్లేల డిమాండ్ సంవత్సరానికి 38శాతానికి తగ్గింది. ఫ్లెక్సిబుల్ ఓఎల్‌ఈడీ డిస్‌ప్లే మిలియన్ల సార్లు ఫోల్డ్ చేసినా ఎలాంటి నష్టం లేకుండా పని చేస్తుంది. ఆపిల్ కొత్త డిజైన్.. ప్రస్తుత ఐఫోన్ పీచర్స్, కొత్త ఫోల్డింగ్ మెకానిజానికి జోడించడం ద్వారా ఓ ప్రత్యేకమైన ఎక్స్‌పీరియన్స్ అందించనున్నది. ఆపిల్ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్స్ అందుబాటులోకి వస్తే మార్కెట్‌పై భారీ ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే ఇప్పటికే ఆపిల్ ఉత్పత్తులు మార్కెట్లకు భారీగా డిమాండ్ ఉన్న విషయం తెలిసిందే.

## కింగ్‌ఫిషర్ టవర్స్‌లో కోట్లు ఖరీదైన
# ఫ్లాట్‌ను కొనుగోలు చేసిన ఇన్ఫీ నారాయణమూర్తి



ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి లగ్జరీ అపార్ట్‌మెంట్ ను కొనుగోలు చేసినట్లు తెలిసింది. బెంగళూరు లోని ప్రఖ్యాత కింగ్‌ఫిషర్ టవర్స్ లో రూ.50 కోట్లు వెచ్చించి విలాసవంతమైన ఫ్లాట్‌ను కొనుగోలు చేసినట్లు సమాచారం. నివేదికల ప్రకారం.. నాలుగు బెడ్‌రూమ్‌ల ఈ ఫ్లాట్ 8,400 చదరపు అడుగుల విస్తీర్ణంలో 16వ అంతస్తులో ఉంది. మొత్తం ఐదు విలాసవంతమైన కార్లను పార్క్ చేసుకోవచ్చు. ముంబైకి చెందిన ఓ వ్యాపారవేత్త నుంచి ఈ ఫ్లాట్‌ను మూర్తి కొనుగోలు చేశారు. కాగా, నాలుగేళ్ల క్రితం నారాయణమూర్తి భార్య సుధామూర్తి అదే కాంప్లెక్స్‌లోని 23వ అంతస్తులో రూ.29 కోట్లతో ఫ్లాట్‌ను కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. కింగ్‌ఫిషర్ టవర్స్ బెంగళూరు నడిబొడ్డున యూబీ సిటీలో ఉంది. ఇది కింగ్ ఫిషర్ అధినేత విజయ్ మాల్యా పూర్వీకుల ఇళ్లు ఉన్న స్థలం. దాదాపు 4.5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలాన్ని విజయ్ మాల్యా- ప్రెస్టీజ్ గ్రూప్ రెండు కలిసి అభివృద్ధి చేశాయి. 34 అంతస్తుల కింగ్‌ఫిషర్ టవర్స్‌లో మూడు బ్లాకులు ఉన్నాయి. వీటిలో 81 అల్ట్రా-లగ్జరీ అపార్ట్‌మెంట్‌లు ఒక్కొక్కటి 8,000 చదరపు అడుగుల విస్తీర్ణం కంటే ఎక్కువ స్థలంలో ఉన్నాయి. 2010లో ప్రాజెక్ట్ మొదటిసారి ప్రారంభించబడినప్పుడు, ఫ్లాట్‌లు చదరపు అడుగులకు రూ.22,000 చొప్పున అమ్ముడయ్యాయి. ప్రస్తుతం మూర్తి చదరపు అడుగు రూ.59,500తో కొనుగోలు చేసినట్లు తెలిసింది.

## మిత్రమా డిసెంబర్ 31 వరకు
# చివరి అవకాశం లేకుంటే రూ.10 వేల పెనాల్టీ!




ఆదాయపు పన్ను దాఖలు సంబంధించి ఎప్పటికప్పుడు అప్‌డేట్స్‌ను తెలుసకోవడం చాలా ముఖ్యం. చిన్నపాటి పొరపాట్లు చేసినా పన్ను చెల్లింపుదారులు ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. జూలై 31, 2024 ఆదాయపు పన్ను దాఖలుకు చివరి తేదీ ఉండేది. ఈ తేదీని మిస్ అయిన వ్యక్తులు తప్పనిసరిగా డిసెంబర్ 31, 2024లోపు ఆలస్యమైన రిటర్న్‌ను ఫైల్ చేయాలి. దీని కోసం (2024-25 పన్ను దాఖలు) ఆలస్యంగా పన్ను దాఖలు రుసుము రూ.5,000 చెల్లించాలి. అన్నింటిలో మొదటిది. వాపసు ఆలస్యం ఏమిటి? దీనికి పెనాల్టీ ఎంత? మీరు పన్నులు వేయకపోతే ఏమి జరుగుతుందో చూద్దాం. ముందుగా వాయిదా వేసిన ఆదాయపు పన్ను అంటే ఏమిటి? పెనాల్టీ మొత్తం గురించి చూద్దాం.

### ఆలస్యమైన ఆదాయపు పన్ను...

ఆలస్యమైన ఆదాయపు పన్ను ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 139(1) కింద వర్తిస్తుంది. ఇది గడువు తేదీకి లేదా అంతకు ముందు చెల్లింపులు చేయని ఆదాయాన్ని సూచిస్తుంది. ఇది సెక్షన్ 139(4) కింద ఆలస్యమైన ఆదాయంగా పరిగణించబడుతుంది. జూలై 31, 2024 2023-2024 సంవత్సరానికి ఆదాయపు పన్ను ఆలస్యంగా దాఖలు చేయడానికి చివరి తేదీ. పన్ను చెల్లింపుదారులు ఈ సమయానికి వారి వ్యక్తిగత లేదా కార్పొరేట్ ఆదాయపు పన్ను రిటర్న్‌లను అంచనా వేసి దాఖలు చేసి ఉండాలి.

### చివరి తేదీ ఏమిటి?

ఆలస్యంగా పన్ను దాఖలు చేయడానికి డిసెంబర్ 31చివరి తేదీ. మీరు ఈ తేదీలోపు మీ పన్ను రిటర్న్‌ను ఫైల్ చేయాలి. లేకుంటే పన్ను దాఖలు చేసిన వారికి రూ.10 వేలకు పైగా జరిమానా విధిస్తారు. అంటే మీ ఆదాయం రూ.5 లక్షలు దాటితే పన్ను చెల్లించకుంటే ఈ జరిమానా విధిస్తారు. అలాగే, పన్ను చెల్లింపు ఆలస్యంగా రూ.5 లక్షల వరకు జరిమానా విధిస్తారు. ఆలస్యమైన ఆదాయపు పన్నును ఎలా ఫైల్ చేయాలి? ఆదాయపు పన్ను శాఖ పన్ను ఇ-ఫైలింగ్ వెబ్‌సైట్‌కి వెళ్లండి. మీ పాన్ నంబర్‌తో లాగిన్ కావాలి. ఐటీఆర్ ఫారమ్‌పై క్లిక్ చేయండి. తగిన ఫారమ్‌ను ఎంచుకుని, ఆదాయ సమాచారాన్ని అందించండి. మూల్యాంకన సంవత్సరాన్ని ఎంచుకోండి. ఆదాయం, ఖర్చులు, బాధ్యతలతో సహా సమాచారాన్ని అందించండి. ఆదాయపు పన్ను చెల్లించండి. బకాయి ఉన్న ఆదాయపు పన్నుపై పెనాల్టీ, వడ్డీ విధించబడుతుంది. రిటర్న్‌ని సమర్పించుపై క్లిక్ చేయండి. ఆధార్ వెరిఫికేషన్ కూడా జరుగుతుంది. అలాగే, ఆన్‌లైన్‌లో ఆదాయపు పన్ను చెల్లించేటప్పుడు నెట్ బ్యాంకింగ్ ధృవీకరణ జరుగుతుంది.

# మార్కెట్లోకి హోండా థర్డ్ జనరేషన్ అమేజ్ రూ.7.99 లక్షల నుంచి ప్రారంభం




ప్రముఖ కార్ల తయారీ సంస్థ హోండా ఇండియా తన థర్డ్ జనరేషన్ సబ్ కంపాక్ట్ అమేజ్ కారు దేశీయ మార్కెట్లో ఆవిష్కరించింది. దీని ధర రూ.7.99 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభమై రూ.10.89 లక్షల (ఎక్స్ షోరూమ్) వరకూ పలుకుతుంది. ఇవీ ఇంట్రడ్యూసరీ ధరలు అని, 45 రోజుల వరకూ బుకింగ్ చేసుకునే వారికి ఈ ధరలు వర్తిస్తాయి. వీ, వీఎక్స్, జడ్ఎక్స్ వేరియంట్లలో న్యూ అమేజ్ లభిస్తుంది. న్యూ మారుతి సుజుకి డిజైర్, హ్యుండాయ్ ఔరా, టాటా టైగోర్ వంటి పాపులర్ కంపాక్ట్ సెడాన్‌లతో పోటీ పడుతుంది. సెకండ్ లెవల్ అడాస్ షూట్ తో వస్తున్న హోండా అమేజ్ అత్యంత పాపులర్ కారు. కొల్లిషన్ మిటిగేషన్ బ్రేకింగ్, ఆటో హై బీం, అడ్వాన్స్ క్రూయిజ్ కంట్రోల్, లేన్ కీపింగ్ అసిస్ట్, రోడ్ డిపార్చర్ మిటిగేషన్ తదితర ఫీచర్లు ఉన్నాయి. ఆసక్తి గల కస్టమర్లు ఆన్‌లైన్‌లో గానీ, సమీప డీలర్ల వద్ద గానీ బుక్ చేసుకోవచ్చు. 2025 జనవరి నుంచి డెలివరీలు ప్రారంభిస్తారు. హోండా న్యూ అమేజ్ కారు 1.2 లీటర్ల, ఫోర్ సిలిండర్ పెట్రోల్ ఇంజిన్ కలిగి ఉంటుంది. ఈ ఇంజిన్ 5-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్ లేదా సీవీటీ ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్ తదితర ఫీచర్లు ఉంటాయి. హోండా లేన్ వాచ్ కెమెరా ఉంటుంది. ఇది బ్లైండ్ స్పాట్ మానిటర్ మాదిరిగా పని చేస్తుంది.

### హోండా అమేజ్ వీ వేరియంట్ ఇలా

హోండా అమేజ్ వీ వేరియంట్ ఎంట్రీ లెవెల్ కారు. పవర్ అడ్జస్టబుల్, బాడీ కలర్డ్ ఓఆర్వీఎంస్ విత్ ఎల్ఈడీ టర్న్ ఇండికేటర్స్, 8-అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్ విత్ వైర్ లెస్ ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్ ప్లే, సెమీ డిజిటల్ ఇన్ స్ట్రుమెంట్ క్లస్టర్, 7- అంగుళాల ఎంఐడీ ఉంటాయి. వాయిస్ కమాండ్స్, 4-స్పీకర్ సౌండ్ సిస్టమ్, మాన్యువల్ ఎయిర్ కండిషనింగ్, స్టీరింగ్ మౌంటెడ్ కంట్రోల్స్, 4-స్పీకర్ సౌండ్ సిస్టమ్, టిల్ట్ స్టీరింగ్ అడ్జస్ట్, 14 అంగుళాల స్టీల్ వీల్స్ విత్ కవర్స్, ఎల్ఈడీ ప్రొజెక్టర్ హెడ్ లైట్స్ విత్ ఎల్ఈడీ డీఆర్ఎల్స్, ఎల్ఈడీ టెయిల్ లైట్స్, షార్క్ ఫిన్ యాంటినా ఉంటాయి. హోండా అమేజ్ వీ వేరియంట్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్ రూ.8 లక్షలు (ఎక్స్ షోరూమ్), సీవీటీ ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్ రూ.9.20 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది.

ఫ్యాబ్రిక్ అప్ హొల్స్టరీ, రేర్ ఆర్మ్ రెస్ట్ విత్ కప్ హోల్డర్స్, పెడల్ షిఫ్టర్స్ (సీవీటీ), కీ లెస్ ఎంట్రీ, ఎలక్ట్రికల్ ట్రంక్ లాక్ విత్ కీలెస్ రిలీజ్, ఆల్ ఫోర్ పవర్ విండోస్, 6 ఎయిర్ బ్యాగ్స్, ఏబీఎస్ విత్ ఈబీడీ, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్ (ఈఎస్సీ), ట్రాక్షన్ కంట్రోల్, డే / నైట్ ఇన్ సైడ్ రేర్ వ్యూ మిర్రర్, 3- పాయింట్ సీట్ బెల్ట్స్, హెడ్ రీస్ట్రెంట్స్ ఫర్ ఆల్ సీట్స్, హిల్ స్టార్ట్ అసిస్ట్, ఐసోఫిక్స్ చైల్డ్ సీట్ మౌంట్స్, రేర్ పార్కింగ్ సెన్సర్లు అండ్ కెమెరాలు ఉంటాయి.

### హోండా అమేజ్ వీఎక్స్ ఇలా

హోండా అమేజ్ మిడ్ స్పెషిఫికేసన్ వీఎక్స్ ట్రిమ్ కారు మాన్యువల్ ట్రాన్స్ మిషన్ వేరియంట్ రూ.9.10 లక్షలు (ఎక్స్ షోరూమ్), సీవీటీ ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్ వేరియంట్ రూ.10 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది. అదనంగా ఎల్ఈడీ ప్రొజెక్టర్ ఫాగ్ లాంప్స్, 15-అంగుళాల అల్లాయ్ వీల్స్, పవర్ ఫోల్డింగ్ వింగ్ మిర్రర్స్ తోపాటు సాటిన్ మెటాలిక్ గార్నిష్ ఆన్ డాష్ బోర్డ్, పుష్ స్టార్ట్ అండ్ స్టాప్ బటన్, ఆటో హెడ్ ల్యాంప్స్, వైపర్స్, రేర్ డీఫాగర్, రిమోట్ ఇంజిన్ స్టార్ట్ (సీవీటీ), ఆటో క్లైమేట్ కంట్రోల్ విత్ మ్యాక్స్ కూల్ మోడ్, రేర్ ఏసీ వెంట్స్, వైర్ లెస్ చార్జర్, కనెక్టెడ్ కార్ టెక్ విత్ అలెక్సా కంపాటిబిలిటీ, టూ అడిషనల్ ట్వీటర్లు, రేర్ వ్యూ కెమెరా, లేన్ వాచ్ కెమెరా ఉంటాయి.

### రూ.9.70 లక్షల నుంచి అమేజ్ జడ్ఎక్స్

టాప్ స్పెక్ జడ్ఎక్స్ ట్రిమ్ కారు డ్యుయల్ టోన్ 15-అంగుళాల వీల్స్, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్ వంటి హోండా సెన్స్ అడాస్ ఫీచర్లు, ఆటోమేటిక్ ఎమర్జెన్సీ బ్రేకింగ్ సిస్టమ్, లేన్ కీపింగ్ అసిస్ట్, ఆటో హై బీం తదితర ఫీచర్లు ఉంటాయి. రేడియంట్ రెడ్ మెటాలిక్, ఒబ్సిడియాన్ బ్లూ పెరల్, గోల్డెన్ బ్రౌన్ మెటాలిక్, మీటరాయిడ్ గ్రే మెటాలిక్, లునార్ సిల్వర్ మెటాలిక్, ప్లాటినం వైట్ పెరల్ రంగుల్లో అమేజ్ కారు లభిస్తుంది. 1.2 లీటర్ల 4-సిలిండర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్ విత్ 5-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్ లేదా సీవీటీ ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్ వేరియంట్లలో లభిస్తుంది. ఈ ఇంజిన్ గరిష్టంగా 90 హెచ్పీ విద్యుత్ %-% 110 ఎన్ఎం టార్చ్ వెలువరిస్తుంది. సీవీటీ మోడల్ కారు లీటర్ పెట్రోల్ పై 19.46 కి.మీ, 5-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్ ఆప్షన్ 18.65 కి.మీ మైలేజీ ఇస్తుంది. మూడేండ్లు స్టాండర్డ్ వారంటీతోపాటు దాన్ని అపరిమిత దూరంతోపాటు ఏడేండ్ల వరకూ పొడిగించుకునే అవకాశం ఉంటుంది. అప్ రైట్ గ్రిల్లె, ట్విన్ పాడ్ ప్రొజెక్టర్ హెడ్ లైట్స్, సింపుల్ అండ్ నీట్ బంపర్ డిజైన్ విత్ ప్రొజెక్టర్ ఫాగ్ ల్యాంప్స్ తదితర ఫీచర్లు ఉంటాయి.

## సరికొత్త మ్యూచువల్
# ఫండ్ ఇన్వెస్ట్ చేస్తే లాభాల పంటే



ఇది ఒక ఈక్విటీ ఫండ్ లాంటిది. ఇందులో కొన్ని ఫండ్స్ సమ్మేళాలను కలిగి ఉంటుంది. అందులో ఇన్వెస్ట్ చేస్తే ఎక్కువ లాభాలు పొందవచ్చు. యాక్టివ్ మమూమెంట్ ఫండ్ ప్రణాళిక. యూనియన్ మ్యూచువల్ ఫండ్ తన కొత్త ఫండ్ ఆఫర్ %-% యూనియన్ యాక్టివ్ మొమెంటం ఫండ్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఊపందుకుంటున్న స్టాక్‌లలో పెట్టుబడి వ్యూహాన్ని అనుసరించి, ఫ్యాక్టర్-బేస్డ్ ఇన్వెస్టింగ్‌లోకి ప్రవేశించడాన్ని ఇది సూచిస్తుంది. మొమెంటం ఫండ్ నవంబర్ 28, 2024 నుండి సభ్యత్వాల కోసం ఓపెన్ చేయగా, ఇప్పుడు ముగియనున్నట్లు ప్రకటించింది. ఫండ్ (న్యూ ఫండ్ ఆఫర్ ) నవంబర్ 28న సబ్‌స్క్రిప్షన్‌ల కోసం ప్రారంభించగా, డిసెంబర్ 12, 2024న క్లోజ్ కానుంది. అయితే సబ్‌స్క్రిప్షన్‌లు కేటాయింపు నుండి 5 పని దినాలలోపు తిరిగి తెరవనున్నారు. యూనియన్ యాక్టివ్ మొమెంటమ్ ఫండ్ ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్. మొమెంటం థీమ్‌ను అనుసరించే స్కీమ్. ఇది మొమెంటం చూపించే స్టాక్‌లలో పెట్టుబడి పెడుతుంది. యూనియన్ యాక్టివ్ మొమెంటం ఫండ్, యాజమాన్య పరిమాణాత్మక నమూనాను అనుసరిస్తుంది. ఈ ఫండ్ పెట్టుబడిదారులకు స్టాక్‌లలో పెట్టుబడి పెట్టడానికి నియమ నిబంధనలతో అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. మొమెంటంకు సంబంధించిన వివరాలను అందిస్తుంది. అయితే ఈ పెట్టుబడులు పూర్తిగా నియమ నిబంధనలపై ఆధారపడి ఉంటాయి. ఇందులో ఇన్వెస్ట్ చేయడం, పెట్టుబడిదారులకు లాభాలు అందించడం, వారి సమస్యలను సులభతరం చేస్తుంది. అంతేకాదు పెట్టుబడులపై నిరంతరం పర్యవేక్షిస్తుందని కో-ఫండ్ మేనేజర్ గౌరవ్ చోప్రా తెలిపారు. ఇది ఒక ఈక్విటీ ఫండ్ లాంటిది. ఇందులో కొన్ని ఫండ్స్ సమ్మేళాలను కలిగి ఉంటుంది. అందులో ఇన్వెస్ట్ చేస్తే ఎక్కువ లాభాలు పొందవచ్చు. యాక్టివ్ మమూమెంట్ ఫండ్ ప్రణాళిక 15 ఏళ్లుగా పలు రకాల ఫండ్స్ ఫాలో అవుతూ యూనియన్ యాక్టివ్ ఫండ్‌ను అందుబాటులోకి తీసుకువస్తోంది. ధర పెరుగుదల, స్థిరమైన లాభాలు, ఈక్విటీ మొదలైన వాటితో ట్రస్ట్ ముందుకు సాగుతోంది. అంతేకాకుండా ఈ ట్రస్ట్‌పై పెట్టుబడిదారుల నమ్మకాన్ని చేకూరుస్తోంది. ఈ ఫండ్ పెట్టుబడిదారులకు సరైన స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడానికి మంచి వ్యూహాలను అందిస్తుంది. అలాగే ఈ ఫండ్‌లో పెట్టుబడులపై పూర్తిగా నియమ నిబంధనలతో ఉంటాయి. సంజయ్ బెంబాల్కర్, హెడ్ ఈక్విటీ జోడించారు, "మొమెంటం పెట్టుబడిదారులు ఎలా వ్యవహరిస్తారు అనే దాని గురించి ఈక్విటీ హెడ్ సంజయ్ బెంబాల్కర్ మాట్లాడారు. ఇన్వెస్టర్లకు సరైన సమాచారం అందించడం, స్టాక్ ధరలను పెంచడం, పెట్టుబడిదారులు లాభాలు అర్జించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు మార్కెట్ రిస్క్‌లకు లోబడి ఉంటాయి. అన్ని స్కీమ్ సంబంధిత వివరాలు పూర్తిగా తెలుసుకొని ఇన్వెస్ట్ చేయడం మంచిది.

## వికారాబాద్ కుర్రోడి సత్తా రూ.2 కోట్ల
# ప్యాకేజీతో అమెజాన్‌లో కొలువు




తెలంగాణ కుర్రోడు దిగ్గజ వ్యాపార సంస్థ అమెజాన్ లో భారీ ప్యాకేజీతో కొలువు దక్కించుకున్నాడు. ఎక్కడో మారుమూల గ్రామంలో చదువుకుని అంతర్జాతీయ ప్రఖ్యాతిగాంచిన అమెజాన్ లో ఉన్నత కొలువు దక్కడంటై గ్రామస్థులతో పాటు, తల్లిదండ్రులు సైగం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.. తెలంగాణ రాష్ట్రంలో మారుమూల ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ఏకంగా గ్రోబల్ ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్‌లో ఏడాదికి రూ.2 కోట్ల వార్షిక ప్యాకేజీతో కొలువు దక్కించుకుని అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఇప్పటికే ఆఫర్ లెటర్ కూడా అందుకున్నాడు. ఈ క్రమంలో సోమవారం నుంచి ఉద్యోగంలో చేరేందుకు సిద్ధమయ్యాడు. అతనెవరో.. ఏం చదువుకున్నాడో.. ఆ వివరాలు మీకోసం.. వికారాబాద్ జిల్లాలోని బొంరాస్‌పేట మండలం తుంకిమెట్ల గ్రామానికి చెందిన అర్బాజ్ ఖురేషీ గురించే మనం చర్చిస్తుంది. అర్బాజ్ ఖురేషీకి చిన్నప్పటి నుంచే చదువుపై మక్కువ ఎక్కువ. ఐఐటీ పట్నాలో బీటెక్‌లో సీటు దక్కించుకున్న అర్బాజ్ ఖురేషీ 2019లో ఖురేషీ కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ డిగ్రీ పూర్తి చేశాడు. బీటెక్ మూడో ఏడాదిలో ఉండగానే.. ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ మెషిన్ లెర్నింగ్ ఎక్స్‌ఫర్ట్ గేల్ దయాస్ వద్ద 3 నెలలు ఇంటర్న్‌షిప్ కూడా పూర్తి చేశాడు. ఆ తర్వాత బెంగళూరులోని మైక్రోసాఫ్ట్ రీసెర్చ్‌లో ఉద్యోగం రావడంతో.. అక్కడ రెండేళ్ల పాటు జాబ్ చేశాడు. అనంతరం అమెరికాకు వెళ్లి, అక్కడ యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్ నుంచి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (%ూ×%), మెషిన్ లెర్నింగ్‌లో ఎంఎస్ పూర్తి చేశాడు. తాజాగా ప్రఖ్యాత వ్యాపార దిగ్గజం అమెజాన్ ఐటీ సంస్థలో కొలువు దక్కించుకున్నాడు. ఏకంగా రూ.2 కోట్ల వార్షిక వేతనంతో సోమవారం నుంచి విధుల్లో చేరనున్నాడు. ఖురేషీ తండ్రి యాసిన్ ఖురేషీ కూడా తెలంగాణలో ఎక్సైజ్ జాయింట్ కమిషనర్‌గా ప్రస్తుతం పని చేస్తున్నారు. అర్బాజ్ ఖురేషీకి దక్కిన అరుదైన అవకాశం పట్ల తల్లిదండ్రులతో పాటు, గ్రామస్తులు అభినందనలు తెలుపుతున్నారు.

## త్వరలో ఐపీఓకు ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా




దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ మేజర్ ఎల్‌జీ అనుబంధ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా త్వరలో ఐపీఓకు రానున్నది. ఇందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబీ'కి ముసాయిదా పత్రాలు సమర్పించింది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో ఈ ఐపీఓ జరుగబోతున్నది. రూ.15,237 కోట్ల నిధుల సేకరణ లక్ష్యంతో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ఐపీఓకు వెళుతోంది. ఈ ఐపీఓలో ఎల్‌జీ ప్రమోటర్ సంస్థ 'ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఐఎన్సీ 10.18 కోట్ల షేర్లు విక్రయిస్తుంది. మోర్గాన్ స్టాన్లీ, యాక్సిస్ క్యాపిటల్, బోఫా సెక్యూరిటీస్, సిటీ గ్రూప్ బుక్, జేపీ మోర్గాన్ సంస్థలు ఐపీఓ మేనేజర్లుగా వ్యవహరిస్తాయి. దక్షిణ కొరియా ఆటో మేజర్ హ్యుండాయ్ మోటార్ ఇండియా ఐపీఓ ద్వారా రూ.27 వేల కోట్ల నిధులు సేకరించిన కొన్ని రోజులకే ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ఐపీఓకు వెళ్లడం ఆసక్తికర పరిణామం. దేశంలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా.. వాషింగ్ మిషన్లు, టీవీలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు విక్రయిస్తున్నది.

## 25 ఏళ్లు.. రూ.85 లక్షల కోట్లు
### ఎఫ్‌డీఐలకు అడ్డాగా భారత్.. డీపీఐఐటీ




సరళీకృత ఆర్థిక విధానాలతో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కు భారత్ కేంద్రంగా మారుతోంది. 2000 సంవత్సరం సెప్టెంబరు నుంచి 2024 సెప్టెంబరు మధ్య కాలంలో మన దేశం 1,03,340 కోట్ల డాలర్ల (సుమారు రూ.84.5 లక్షల కోట్లు) ఎఫ్‌డీఐని ఆకర్షించింది. పారిశ్రామిక, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ (డీపీఐఐటీ) ఆదివారం ఇందుకు సంబంధించిన గణాంకాలు విడుదల చేసింది. ఈక్విటీ పెట్టుబడులు, ఆ పెట్టుబడులపై వచ్చిన ఆదాయాన్ని తిరిగి పెట్టుబడిగా పెట్టడం, ఇతర మూలధన పెట్టుబడులన్నీ ఎఫ్‌డీఐ కోవలోకి వస్తాయి. ఈ పాతికేళ్లలో మన దేశానికి వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐలో 25 శాతం ఒక్క మారిషస్ నుంచే రావడం విశేషం. సింగపూర్ (24 శాతం), అమెరికా (10 శాతం), నెదర్లాండ్ (7 శాతం), జపాన్ (6 శాతం), యూకే (5 శాతం), యూఏఈ (3 శాతం) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.